సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 26 । ఏప్రిల్ । 2025



చీనీ టన్ను రూ.21 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.21 వేలు, కనిష్టంగా రూ.4 వేల ప్రకారం ధర పలికాయి.



ధర పతనం.. రైతుకు తీరని నష్టం

కళింగర, దోస పంటలు నట్టేట ముంచాయి. కిలో రూ.5 చొప్పున కూడా అమ్ముడయ్యే పరిస్థితి లేకపోవడంతో పెట్టుబడి సైతం చేతికి అందక రైతులు నష్టపోయారు. 10లో

గరిష్టం/కనిష్టం

41.8°/21.7°

జిల్లాలో శుక్రవారం గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వేసవితాపం అధికంగా కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

అధికారం కోసం అడ్డదారులు

టీడీపీ ఫిరాయింపు రాజకీయం

- మున్సిపాలిటీల్లో పెత్తనం కోసం బరితెగింపు
- ఇప్పటికే అడ్డదారిలో హిందూపురం మున్సిపాలిటీ కైవసం
- తాజాగా కదిరి మున్సిపల్ చైర్ పర్సన్‌పై అవిశ్వాసం
- ఒకట్రెండు రోజుల్లో మడకశిర పీఠంపై కూటమి కుట్రలు
- బలం లేకున్నా.. బలవంతంగా ఫిరాయింపు రాజకీయం
- కేసుల పేరుతో భయపెట్టి టీడీపీ కండువా కప్పుతున్న వైనం



సాక్షి, పుట్టపర్తి

ప్రజా క్షేత్రంలో ఓడినా.. అడ్డదారిలో మున్సిపాలిటీల్లో పెత్తనం చెలాయించాలని కూటమి నాయకులు భావిస్తున్నారు. ఇందుకోసం ఫిరాయింపు రాజకీయాలకు తెరలేపారు. ప్రత్యర్థి పార్టీ తరఫున గెలిచిన వారిని బెదిరిస్తూ.. పదవులు ఆఫర్ చేస్తూ.. పచ్చ కండువా కప్పేస్తున్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ.. రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ.. అడ్డదారుల్లో అధికారం చేపట్టేందుకు నానా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే హిందూపురం మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకున్నారు. ఇటీవలే కదిరి మున్సిపల్ పీఠాన్ని చేజిక్కించుకునే క్రమంలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. తాజాగా మడకశిర మున్సిపల్ సీటును సైతం దక్కించుకునేందుకు టీడీపీ నేతలు కుట్రలు చేసున్నారు. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని ఇప్పటికే కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. నేడో, రేపో బల పరీక్షకు రంగం సిద్ధం చేస్తున్నారు.

మెజారిటీ సీట్లు రాకున్నా..

జిల్లాలో హిందూపురం, కదిరి, ధర్మవరం, మడకశిర, పుట్టపర్తి, పెనుకొండ మున్సిపాలిటీలుండగా... 2021లో జరిగిన 'స్థానిక' ఎన్నికల్లో టీడీపీ ఏ ఒక్క చోట కూడా అధికారం చేపట్టలేకపోయింది. ఆరు మున్సిపాలిటీల్లోనూ వైఎస్సార్ సీపీ విజయ ఢంకా మోగించడంతో ఆ పార్టీ అభ్యర్థులే చైర్మన్లుగా బాధ్యతలు చేపట్టారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టీడీపీ నేతలు అడ్డదారిలో ఫిరాయింపు రాజకీయాలకు తెరలేపారు. వైఎస్సార్‌సీపీ సభ్యులను కేసుల పేరుతో బెదిరిస్తూ.. పార్టీ మారేలా చేశారు. అనంతరం అధికారులను అడ్డు పెట్టుకుని అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి.. సంతకాలు సేకరించి.. పీఠం కైవసం చేసుకుంటున్నారు.

సింగిల్ డిజిట్‌కే పరిమితం

జిల్లాలోని ఏ ఒక్క మున్సిపాలిటీలో కూడా టీడీపీకి రెండంకెల సంఖ్య సీట్లు లేవు. ప్రతి మున్సిపాలిటీలో సింగిల్ డిజిట్‌కే పరిమితమైంది. హిందూపురంలో 38 సీట్లకు గానూ ఆరు, మడకశిరలో 20 సీట్లలో ఐదు, కదిరిలో 36 స్థానాల్లో ఐదు చోట్ల టీడీపీ గెలిచింది. పుట్టపర్తిలో 20 వార్డులకు గానూ 6 చోట్ల, పెనుకొండలో 20 సీట్లకు గానూ రెండు చోట్ల, ధర్మవరంలో 40 స్థానాలకు గానూ టీడీపీ బోణీ కూడా కొట్టలేదు. కానీ అడ్డదారిలో ఇప్పటికే హిందూపురం పీఠాన్ని టీడీపీ చేజిక్కించుకుంది. కదిరిలో పాగా వేసేందుకు ప్లాన్ కుదిరింది. మడకశిర సీటును సాధించేందుకు కుట్ర జరుగుతోంది.

'పురం'లో ఆరు సీట్లు గెలిచి..

హిందూపురం మున్సిపాలిటీలో 38 స్థానాలకు వైఎస్సార్‌సీపీ 29 చోట్ల, టీడీపీ 6 చోట్ల, బీజేపీ 1, ఎంఐఎం 1, ఇండిపెండెంట్ 1 చోట గెలిచారు. మున్సిపల్ పీఠం కైవసం చేసుకోవాలంటే.. కనీసం 20 మంది సభ్యుల మద్దతు అవసరం. అయితే వైఎస్సార్‌సీపీ నుంచి 13 మందిని ప్రలోభాలకు గురి చేసి టీడీపీలో చేర్చుకున్నారు. అప్రజాస్వామికంగా ఎన్నిక జరిగి మున్సిపల్ చైర్మన్ సీటును టీడీపీ గెలుచుకుంది. వైఎస్సార్‌సీపీ హయాంలో బీసీ మహిళకు అవకాశం ఇవ్వగా.. ప్రస్తుత కూటమి సర్కారు పురుషుడికి పెత్తనం కట్టింది. పార్టీ ఫిరాయించిన వారిని ఇప్పుడు కూరలో కరివేపాకులా పక్కన పడేసింది.

కదిరిలో ఐదు సీట్లు గెలిచి..

కదిరి మున్సిపాలిటీలో 36 వార్డులున్నాయి. 2021లో జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 30 చోట్ల గెలవగా.. టీడీపీ కేవలం 5 స్థానాలు మాత్రమే సాధించింది. మరో స్థానంలో రెబల్ అభ్యర్థి గెలిచారు. కాగా ఇటీవల కేసుల పేరుతో వైఎస్సార్‌సీపీ సభ్యులను బెదిరించి.. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. తమకు మద్దతు ఇవ్వకుంటే ఇబ్బంది పడతారని బెదిరించడంతో చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా 25 మంది చేతులెత్తారు. దీంతో చైర్‌పర్సన్ పదవి కోల్పోవాల్సి వచ్చింది. త్వరలోనే ఎన్నిక నిర్వహించి కొత్త చైర్మన్ ఎన్నుకోనున్నారు.

మడకశిర మున్సిపల్ పీఠంపై టీడీపీ కన్ను

- దళిత మహిళకు అన్యాయం చేసేందుకు కుట్ర
- కలెక్టర్‌కు అవిశ్వాసం నోటీసు ఇచ్చిన కౌన్సిలర్లు



మడకశిర: మడకశిర మున్సిపాలిటీని అడ్డదారుల్లో తన ఖాతాలో వేసుకోవడానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నాలను ప్రారంభించింది. ఇందుకోసం ఇప్పటికే పావులు కదిపింది. సొంతంగా బలం లేకపోవడంతో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను ప్రలోభాలకు గురిచేసింది. చైర్‌పర్సన్‌గా ఉన్న దళిత మహిళను ఎలాగైనా పీఠం నుంచి దింపేందుకు రంగం సిద్ధం చేసింది.

20 స్థానాల్లో 15 వైఎస్సార్ సీపీవే..

మడకశిర మున్సిపాలిటీలో 20 వార్డులుండగా...గత 'స్థానిక' ఎన్నికల్లో 15 వార్డుల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు విజయఢంకా మోగించారు. టీడీపీ కేవలం ఐదు స్థానాలతో సరిపెట్టుకుంది. చైర్మన్ స్థానం ఎస్సీ జనరల్‌కు రిజర్వు కాగా, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ పీఠంపై ఓ మహిళను కూర్చోబెట్టాలని భావించారు. ఈ నేపథ్యంలోనే 7వ వార్డు నుంచి గెలుపొందిన దళిత సామాజిక వర్గానికి చెందిన లక్ష్మీ నరసమ్మకు చైర్‌పర్సన్‌గా అవకాశం ఇచ్చి పాలనలో మహిళలను భాగస్వామ్యులను చేశారు. కానీ టీడీపీ నేతలు మాత్రం దళిత మహిళను చైర్‌పర్సన్ స్థానం నుంచి దించడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లకు గాలం..

ఎలాగైనా సరే మడకశిర మున్సిపాలిటీని కైవసం చేసుకోవాలని భావిస్తున్న టీడీపీ నాయకులు.. తమకు తగినంత బలం లేకపోవడంతో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లకు గాలం వేస్తున్నారు. ప్రలోభాలకు గురిచేసి, భయపెట్టి ఇప్పటికే 8 మందికి టీడీపీ కండువా కప్పేశారు. దీంతో టీడీపీ బలం 13కు చేరగా...వారందరితో సంతకాలు చేయించి చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మపై అవిశ్వాసం ప్రవేశ పెట్టడానికి అవకాశం కల్పించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

న్యూస్‌రీల్

'పురం' మార్కెట్‌కు తగ్గిన పట్టుగూళ్లు

- మూడురోజులుగా 1,500 కిలోల లోపేరాక



మార్కెట్‌లో పట్టు గూళ్ల క్రయ విక్రయాలు

హిందూపురం అర్బన్: రాష్ట్రంలోనే పేరుగాంచిన హిందూపురం పట్టుగూళ్ల మార్కెట్‌కు సరుకు రావడం తగ్గిపోయింది. సీజన్‌లో రోజూ 8 టన్నుల నుంచి 12 టన్నుల వరకు పట్టుగూళ్లు వచ్చేవి. అన్ సీజన్‌లో అయితే 3 టన్నులకు తగ్గకుండా పట్టుగూళ్లు వచ్చేవి. కానీ మూడు రోజులుగా మార్కెట్‌కు 1,500 కిలోల లోపే పట్టు గూళ్లు రావడంతో మార్కెట్ అధికారులను కలవరపాటుకు గురిచేసింది. ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు, వైరస్‌తో దిగుబడి తగ్గడంతో పట్టుగూళ్ల ఉత్పత్తులు తగ్గాయి. కర్ణాటక ప్రాంతాల్లోని మార్కెట్లలో ధరలు కాస్త ఎక్కువగా ఉండటంతో అరకొర దిగుబడిని కూడా రైతులు అక్కడికే తీసుకెళ్తున్నారు. దీంతో హిందూపురం మార్కెట్‌కు వచ్చే పట్టుగూళ్లు తగ్గిపోయాయి.

కిలో బైవోల్టిన్ పట్టుగూళ్లు రూ.662..

హిందూపురం పట్టుగూళ్ల మార్కెట్‌లో కిలో బైవోల్టిన్ పట్టుగూళ్లు గరిష్టంగా రూ.662 వరకూ పలుకుతున్నాయి. ఈ నెల 23వ తేదీన 824 కిలోలు, 24వ తేదీన 979 కిలోలు, 25వ తేదీన 1,481 కిలోల పట్టుగూళ్లు మార్కెట్‌కు వచ్చాయి. కిలో పట్టు గూళ్లు (బైవోల్టిన్) గరిష్టంగా రూ. 662, కనిష్టం రూ.358, సరాసరిన రూ. 582 ప్రకారం ధర పలికాయి. కర్ణాటక ప్రాంత మార్కెట్లలో ఒకటి, రెండు లాట్లకు ఎక్కువ రేటు చూపుతారని, మిగతా వాటికి ఇక్కడి కంటే తక్కువే ధర వస్తోందని హిందూపురం మార్కెట్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మిరెడ్డి తెలిపారు. రైతులు దూరభారం వెళ్లి మోసపోవద్దని సూచించారు. నాణ్యమైన పట్టుగూళ్లకు స్థానికంగానే మంచి ధర లభిస్తోందని ఆయన వెల్లడించారు.


సజావుగా ధ్రువపత్రాల పునఃపరిశీలన



ఆర్థోకు సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న డాక్టర్ ఆత్మారాం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఉపాధ్యాయుల మెడికల్ సర్టిఫికేషన్ పునఃపరిశీలన ప్రక్రియ శుక్రవారం సజావుగా సాగింది. శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పరిశీలనకు హాజరయ్యారు. ఆస్పత్రిలోని డీఈఐసీ, బర్న్స్ వార్డు, ఆప్తాల్మిక్ వార్డుల్లో ధ్రువపత్రాల పరిశీలన జరిగింది. ఆర్థో హెచ్‌ఓడీ, ప్రొఫెసర్ డాక్టర్ ఆత్మారాం, వైద్యులు డాక్టర్ ఆనంద్ బాబూ నాయక్, డాక్టర్ ప్రశాంతి, తదితరులు సర్టిఫికెట్లను పరిశీలించారు.

మే 19 నుంచి ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలు



పుట్టపర్తి టౌన్: ఓపెన్ 10వ తరగతి, ఇంటర్ పరీక్షలు మే 19 తేదీ నుంచి 24 వరకు నిర్వహించనున్నట్లు డీఈఓ కృష్ణప్ప తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. అలాగే మే 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఇంటర్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ ఉంటాయని వెల్లడించారు.

అందుబాటులో పాలిసెట్ హాల్‌టికెట్లు

హిందూపురం: ఏపీ పాలిసెట్–2025 (ఆంధ్ర ప్రదేశ్ పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్) హాల్ టిక్కెట్లు www. polycetap.nic.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు హిందూపురం పాలిటెక్నిక్ కళాశాల నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 30వ తేదీన పరీక్ష ఉంటుందని అభ్యర్థులు వెబ్‌సైట్ ద్వారా హాలుటికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఏదైనా సమస్య తలెత్తితే సమీపంలోని సహాయ కేంద్రాలను సంప్రదించాలని సూచించారు.

ప్రశాంతంగా జీవించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రత్న



సమావేశానికి హాజరైన గ్రామ ప్రజలు

- గ్రామ సందర్శనలో ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: గొడవలకు దూరంగా అందరూ ప్రశాంతంగా జీవించాలని ఎస్పీ రత్న సూచించారు. శుక్రవారం రాత్రి ఆమె కొత్తచెరువు మండలం కేశాపురం గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'గ్రామ సందర్శన' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ రత్న ప్రజలతో మమేకమై స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ... గొడవలు, ఫ్యాక్షన్ వల్ల జీవితాలు చిన్నాభిన్నమవుతాయన్నారు. అలాంటి కుటుంబాల్లోని పిల్లల జీవితాలూ నాశనమవుతాయన్నారు. అందరూ ఎవరూ గొడవల జోలికి వెళ్లవద్దన్నారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న నేరాలు, నూతన చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామంలో ఏవైనా సంఘటనలు జరిగితే నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. అనంతరం శక్తి యాప్, డయల్ 112, 100 గురించి వివరించారు. అంతకుముందు కళాజాత బృందం సభ్యులు నాటక ప్రదర్శన, ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో డీఎస్పీ విజయకుమార్, సీఐలు సురేష్, గోపీనాథ్‌రెడ్డి, ఎస్‌ఐలు లింగన్న, కృష్ణమూర్తితో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రోన్ వినియోగంపై రైతులకు శిక్షణ

- జిల్లాలో 35 డ్రోన్ గ్రూపులు: కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: పంటల సాగులో డ్రోన్లు వినియోగించేలా రైతులకు శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. మండలానికి ఒకరికి డ్రోన్ వినియోగంపై శిక్షణ ఇచ్చి రైతులకు అందుబాటులో ఉండేలా చూస్తామన్నారు. పురుగు మందుల పిచికారీ, ఎరువుల చల్లడానికి ఉపయోగకరమైన డ్రోన్లు శుక్రవారం జిల్లాకు చేరుకోగా, కలెక్టర్ అధికారులతో కలిసి వాటి పనితీరును పరిశీలించారు. జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, సెరికల్చర్ అధికారి పద్మమ్మ, టెక్నీషియన్లతో కలిసి పుట్టపర్తి సమీపంలోని పొలాల్లో డ్రోన్ల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో 35 డ్రోన్ గ్రూప్‌లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఒక్కో గ్రూపులో ఐదుగురు రైతులు సభ్యులుగా ఉంటారన్నారు. అందులో ఒకరు డ్రోన్ కన్వీనర్, మరొకరు కో కన్వీనర్‌గా ఉంటారన్నారు. ఒక్కో డ్రోన్ ధర రూ.9.8 లక్షలు కాగా, 80 శాతం సబ్సిడీతో అందజేయనున్నట్లు వెల్లడించారు. రైతు రూ.5 లక్షలు చెల్లిస్తే తక్కిన మొత్తాన్ని బ్యాంకులు రుణం అందిస్తాయన్నారు. డ్రోన్ వినియోగించే సమయానికి సబ్సిడీ మొత్తం రైతు గ్రూపు ఖాతాకు జమ చేస్తారన్నారు. ఇప్పటి వరకు జిల్లాలోని 28 మంది యువతకు పైలెట్ శిక్షణ పూర్తి చేసినట్లు చెప్పారు. తక్కిన 7 మందికి త్వరలో మూడో బ్యాచ్‌లో శిక్షణకు పంపుతామన్నారు. 35 గ్రూపులకు 35 డ్రోన్లు అందజేసి వాటి ద్వారా రైతులు తక్కువ ధరకే మందులు పిచికారీ చేసుకునేలా చూస్తామన్నారు. ప్రస్తుతం గ్రూపులన్నింటికీ బ్యాంక్ ఖాతాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.



డ్రోన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

రూ.కోటికి కుదిరిన డీల్..?

- రియల్టర్ రెడ్డెప్పశెట్టికి రెవెన్యూ అండ
- బెంగళూరు కేంద్రంగా సెటిల్‌మెంట్!
- డివిజనల్ స్థాయి అధికారి పూర్తి సహకారం



చిలమత్తూరు: చిత్రావతి నదిపై ఏకంగా బ్రిడ్జి నిర్మించి నదీజలాలు సొంతానికి మళ్లించుకుని, ప్రభుత్వ భూములు ఆక్రమించుకుని, సమీపంలోని పొలాలకు రైతులు వెళ్లకుండా ఇబ్బందులు పెడుతున్న రియల్టర్ రెడ్డెప్పశెట్టికి 'రెవెన్యూ' అండగా నిలుస్తోంది. ప్రజలకు మేలు చేయాల్సిన ప్రభుత్వశాఖలోని కొందరు అధికారులు అమ్యామ్యాలకు ఆశపడి రియల్టర్‌కు సహకారం అందించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

కోర్టును ఆశ్రయించేందుకు సహకారం

రియల్టర్ రెడ్డెప్పశెట్టి భూ ఆక్రమణలు, రైతులకు పెడుతున్న ఇబ్బందులు, విద్యుత్ చోరీ, నదీ జలాల అక్రమ వినియోగం తదితర వాటిపై 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురితం కాగా, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు హడావుడి చేశారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఇక చర్యలే తరువాయి అన్న తరుణంలో రైతులు, మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. అయితే రెవెన్యూ శాఖలోని ఓ డివిజనల్ స్థాయి అధికారి క్షేత్రస్థాయి నివేదికలను పక్కన పెట్టి సదరు రియల్టర్‌కు అనుకూలంగా వ్యవహరిస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. దీంతో కథ మళ్లీ మొదటికి రావడంతో రియల్టర్ మళ్లీ కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమయ్యారు. తప్పుడు సమాచారంతో తన అక్రమాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నాడు.

ఎవిక్షన్ నోటీసు ఇచ్చినా...

రెడ్డెప్పశెట్టి అక్రమాలు గుర్తించిన అధికారులు నోటీసులు ఇవ్వడం, కేసు నమోదు చేయించడం తదితర చర్యలన్నీ చకచకా జరిగిపోయాయి. నివేదికలను కూడా ఉన్నతాధికారులకు పంపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు రియల్టర్‌కు ఎవిక్షన్ నోటీసు కూడా ఇచ్చారు. నెల గడిచినా చర్యలు తీసుకోలేదు. ఉన్న ఫలంగా రెవెన్యూ డివిజనల్ స్థాయి అధికారి రహస్యంగా రెడ్డెప్పశెట్టి ఎస్టేట్‌కు రావడం, వెళ్లడం జరిగిపోగా... ఆ తర్వాత అన్నీ నెమ్మదించాయి. ఫిబ్రవరి 28వ తేదీ లోపే బ్రిడ్జిని తొలగిస్తామని చెప్పిన ఇరిగేషన్ అధికారులు... రియల్టర్ కోర్టుకు వెళ్లేందుకు సమయాన్ని ఇచ్చి అతను తప్పించుకునేందుకు అవకాశం ఇచ్చారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ భూములు, ఈడీ అటాచ్‌మెంట్ భూములు, నది ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు నోటీసు ఇచ్చి మిన్నకుండి పోయారు. మండలస్థాయి రెవెన్యూ అధికారి హిందూపురానికి పరిమితం కావడం, డివిజనల్ స్థాయి అధికారి ఆదేశాలతో రెడ్డెప్పశెట్టితో లోగుట్టు ఒప్పందాలు చేసుకున్నట్టుగా తెలుస్తోంది.

బెంగళూరు కేంద్రంగా డీల్..?

రియల్టర్ అక్రమాలు, ఆక్రమణలపై నోరు మెదపకుండా ఉండేందుకు బెంగళూరు కేంద్రంగా డివిజనల్ స్థాయి అధికారితో రూ. కోటికి ఒప్పందం చేసుకున్నట్టుగా జోరుగా ప్రచారం జరుగుతోంది. రెడ్డెప్పశెట్టి ఆక్రమణలో ఉన్న భూములను సైతం అధికారికంగా కట్టబెట్టే విధంగా డీల్ కుదిరినట్టుగా తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన బాధ్యతలను ఇప్పటికే ఇద్దరు వీఆర్‌ఓలకు కేటాయించినట్లు తెలుస్తోంది. రియల్టర్ ఆక్రమణలోని భూములు ప్రస్తుతం రూ. కోట్ల విలువ చేస్తుండగా... అధికార యంత్రాంగం ఆయనకు ధారాదత్తం చేసేందుకు సిద్ధం కావడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇంటింటా సౌర వెలుగులు విరజిమ్మాలి



నియోజకవర్గాల అభివృద్ధిపై సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

- అధికారులకు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశం

ప్రశాంతి నిలయం: జిల్లా అంతటా సౌరవెలుగులు విరజిమ్మేలా 'పీఎం సూర్యఘర్' పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ప్రతి నియోజకవర్గంలో 10 వేల పీఎం సూర్యఘర్ రూఫ్‌టాప్ యూనిట్లు ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని కోర్టు హాలులో నియోజకవర్గాల అభివృద్ధిపై జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 'పీఎం సూర్యఘర్'పై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం రూ.60 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.55 వేలు సబ్సిడీగా అందించి యూనిట్‌ను పూర్తి ఉచితంగా అందిస్తుందన్నారు. ఉత్పత్తి అయిన విద్యుత్‌ను లబ్ధిదారు అవసరాలకు వాడుకుని మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు అందిస్తే యూనిట్‌కు రూ.2.90 వంతున చెల్లిస్తారన్నారు. బీసీలకు 2 కిలోవాట్‌కు కేంద్రం రూ.60 వేలు, రాష్ట్ర ప్రభుత్వం 10 వేల చొప్పున రాయితీ ఇస్తుందని, మరో రూ.35 వేలు లబ్ధిదారుడు బ్యాంక్ ద్వారా రుణం పొంది ఐదేళ్లలో తిరిగి చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆర్డీఓలు, తహసీల్దార్లు, బ్యాంకర్లు, విద్యుత్ అధికారులు సమన్వయం చేసుకొని లక్ష్యాలను చేరుకునేందుకు తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఇక అన్ని నియోజకవర్గాల విజన్ ప్రణాళికలు రూపొందించాలని, భూగర్భ జలాలు, వ్యవసాయం, ఉద్యాన శాఖలు పూర్తి వివరాలతో జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రత్యేకంగా అమలు చేస్తున్న వాట్సాప్ గవర్నెన్స్‌కు సంబంధించి పోస్టర్లు, ఫ్లెక్సీలు అన్ని ఆర్డీఓ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేయాలన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. నీటి కాలుష్యం జరగకుండా అధికారులు తనిఖీలు నిర్వహించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్ఓ విజయసారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, ఆర్డీఓలు సువర్ణ, ఆనంద్‌కుమార్, మహేష్, డీపీఓ సమత, డీఎంహెచ్‌ఓ ఫైరోజా బేగం, సీపీఓ విజయ్ కుమార్, గ్రామ/వార్డు సచివాలయాల నోడల్ అధికారి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు పులమతి విద్యార్థిని


వర్ష

లేపాక్షి: మండలంలోని పులమతి గ్రామంలో ఉన్న జెడ్పీహెచ్ఎస్‌లో 8వ తరగతి విద్యార్థిని సి.వర్ష.. జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–14 ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకూ జాతీయ స్థాయి పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో ప్రాతినిధ్యం వహించే ఏపీ జట్టులో చోటు దక్కించుకున్న వర్ష ను... ఆ పాఠశాల హెచ్ఎం సుబ్బారావు, పీడీ రామాంజినేయులు, గ్రామ సర్పంచ్ అశ్వత్థనారాయణ, పాఠశాల కమిటీ అధ్యక్షుడు నరసింహమూర్తి, ఉపాధ్యాయులు అభినందించారు.

వడదెబ్బతో విద్యార్థిని మృతి


గౌతమి (ఫైల్)

పెద్దపప్పూరు: వడదెబ్బ ప్రభావంతో ఓ విద్యార్థిని మృతి చెందింది. స్థానికులు తెలిపిన మేరకు... పెద్దపప్పూరు మండలం చాగల్లు గ్రామానికి చెందిన గంగరాజు, కవిత దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఎనిమిదేళ్ల క్రితం అనారోగ్యాన్ని తాళలేక గంగరాజు ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి కవిత వ్యవసాయ కూలి పనులతో ఇద్దరు కుమార్తెలను పెంచి పోషించుకుంటోంది. ఈ నేపథ్యంలో గురువారం వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురం మండలం గూడూరు అంకాలమ్మ ఆలయానికి వెళ్లి వచ్చారు. ఎండ వేడిమి కారణంగా ఇంటికి చేరుకోగానే కుమార్తె గౌతమి (10)కి వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. జ్వరం వచ్చినట్లు శరీరం మొత్తం కాలిపోతుండడంతో వడదెబ్బకు గురైనట్లుగా నిర్ధారించుకుని బంధువులు వెంటనే తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం అక్కడి వైద్యులు అనంతపురానికి రెఫర్ చేశారు. పరిస్థితి విషమిస్తుండడంతో సర్వజనాస్పత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజామున అక్కడి ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలిక మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా, చాగల్లులోని ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న గౌతమి మృతి విషయం తెలియగానే ఉపాధ్యాయులు, ఎంఈఓ ఓబులపతి విద్యార్థి మృతదేహాన్ని పరిశీలించి, నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు.

ధర పతనం.. రైతుకు తీరని నష్టం

- నట్టేట మునిగిన కళింగర, దోస రైతులు
- పెట్టుబడి సైతం చేతికి అందక ఇబ్బందులు
- కిలో రూ.5 చొప్పున కూడా అమ్ముడుపోని దిగుబడులు


కరావులపల్లి వద్ద తోటలో వదిలేసిన కాయలు


పెదపల్లిలో రైతు జయచంద్రారెడ్డి పొలంలోనే వదిలేసిన కళింగర కాయలు


పెదపల్లి వద్ద బాట పక్కన పడేసిన కళింగర కాయలు

పుట్టపర్తి అర్బన్: వేసవిలో ప్రజలకు ఎంతో ఉపశమనం కలిగించే కళింగర, దోస పంటలు రైతులను నట్టేట ముంచాయి. ఉన్న నీటి వనరులను సద్వినియోగం చేసుకుని ఆరుగాలం శ్రమించి పండించిన పంట కాస్త చేతికి రాగానే ధరల పతనంతో తీవ్ర నష్టాలను చవి చూడాల్సి వస్తోంది. స్థానికంగా మార్కెటింగ్ సదుపాయం కూడా లేకపోవడంతో ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసుకోలేక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. చివరకు కిలో కళింగర, దోస కాయలను రూ.5 చొప్పున విక్రయించేందుకు సిద్ధమైన కొనుగోలుదారులు ముందుకు రాకపోవడంతో పంట పొలాల్లోనే దిగుబడులు వదిలేసిన దైన్య స్థితి.

323 హెక్టార్లలో సాగు..

జిల్లాలో ఏటా వంద హెక్టార్లలో కూడా సాగు చేయని కళింగర, దోస పంటలను ఈ సారి రైతులు ఏకంగా 323 హెక్టార్లలో సాగు చేయడం విశేషం. ఇందులో 118 హెక్టార్లలో కళింగర, మరో 205 హెక్టార్లలో దోస సాగు చేశారు. పంటల సాగుకు ఎకరాకు సుమారు రూ. లక్ష వరకూ ఖర్చు చేశారు. భూమి దుక్కి చేయడం మొదలు.. విత్తనాలు, మల్చింగ్ షీట్, ఎరువులు, డ్రిప్పు ఎరువులు, మందుల పిచికారీ, తొలగించే వరకూ కూలీల ఖర్చులు తడిసి మోపడయ్యాయి. అవగాహన లోపంతో ఉద్యాన అధికారులు, ఫర్టిలైజర్ షాపు యజమానులు, తోటి రైతులు చెప్పిన మందులు, ఎరువులకు పెద్ద మొత్తంలోనే ఖర్చు చేశారు. తీరా పంట చేతికి వచ్చే సమయంలో వైరస్‌కు తోడు వేసవి ఎండల తాకిడికి పంట పొలాల్లోనే కాయల్లో పగుళ్లు వచ్చాయి. అష్టకష్టాలు పడి నాణ్యమైన కాయలను వేరు చేసి మార్కెట్‌కు తరలించేలోపు కేరళ, తమిళనాడు రాష్ట్రాల నుంచి ముందస్తుగానే కళింగర కాయలు ఇబ్బడి ముబ్బడిగా దిగుమతి అయ్యాయి. దీంతో ఇక్కడి పంటలకు గిట్టుబాటు ధర లభించలేదు. చివరకు కొందరు వ్యాపారులు కిలో రూ.5 నుంచి రూ.7 చొప్పున కొనుగోలుకు ముందుకు వచ్చారు. ఈ ధరతో పంటను విక్రయిస్తే కనీసం కూలీల ఖర్చులు కూడా గిట్టుబాటు కాదని భావించిన పలువురు రైతులు దిగుబడులను పొలాల్లోనే వదిలేశారు. రైతుల బలహీనతను ఆసరాగా చేసుకున్న మరికొందరు వ్యాపారులు కళింగరను కిలో రూ.3, దోసను కిలో రూ.7 చొప్పున కొనుగోలు చేస్తామంటున్నారు. దీంతో రైతులు పంటను రోడ్డు పక్కన పడేసి తమ అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఈ పరిస్థితి ఎన్నడూ చూడలేదు

గత పదేళ్లుగా కళింగర, దోస పంటలను సాగు చేస్తున్నా. ఏనాడూ ఇలాంటి పరిస్థితిని చూడలేదు. మార్కెట్ సదుపాయం కల్పించి రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వ వైఫల్యం కూడా మా నష్టాలకు ఒక విధంగా కారణమైంది. టమాట, బొప్పాయి, మిరప, తదితర కూరగాయల పంటల నాణ్యమైన విత్తనాలతో పాటు ఎరువులు, మందులను రైతులకు ప్రభుత్వం అందజేసి, ప్రోత్సహించాలి.

– నారాయణస్వామి, దోస రైతు, గోరంట్ల

పంట పెట్టాలంటే భయమేస్తోంది

నాకున్న రెండు ఎకరాల్లో కళింగర సాగు చేసాను. పంట దిగుబడి చేతికి వచ్చే సమయానికి ధర ఒక్కసారిగా పడిపోయింది. కిలో రూ.3 చొప్పున కొంటామంటూ వ్యాపారులు వచ్చారు. ఆ ధరతో అమ్ముకుంటే భారీగా నష్టపోవాల్సి వస్తుందని, చివరకు ఆటోలో కాయలు వేసుకుని ఊళ్లలో తిరిగి అమ్ముకోవాల్సి వచ్చింది. రూ.2 లక్షలు పెట్టుబడి పెడితే రూ.లక్ష కూడా చేతికి రాలేదు. దీంతో మరో పంట పెట్టాలంటే భయమేస్తోంది.

– జయచంద్రారెడ్డి, కళింగర రైతు, పెదపల్లి

సమస్యలు పరిష్కరించండి

- ఎన్ఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యచంద్రరావు


సమావేశంలో మాట్లాడుతున్న సూర్యచంద్రరావు

పుట్టపర్తి టౌన్: ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని ఎన్ఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యచంద్రరావు డిమాండ్ చేశారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) కడప జోన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.వి.రమణ అధ్యక్షతన కడప జోన్ ప్రథమ మహాసభ శుక్రవారం పుట్టపర్తిలోని సాయిఆరామంలో జరిగింది. ముఖ్య అతిథులుగా ఎన్ఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యచంద్రరావు, నాయకులు శివారెడ్డి, భాస్కరనాయుడు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చెన్నారెడ్డి హాజరై, మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో యాజమాన్యం ఘోరంగా విఫలమైందన్నారు. ఉద్యోగ భద్రతపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సర్క్యులర్ అమలు చేయాలని, అన్ని కేటగిరీల్లో పదోన్నతులు కల్పించి ఖాళీలు భర్తీ చేయాలని, ప్రభుత్వం ద్వారానే విద్యుత్ బస్సులు కొనుగోలు చేసి నిర్వహణ బాధ్యతను ఆర్టీసీ సిబ్బందికి అప్పగించాలని, అన్ని గ్యారేజీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నైట్ అలవెన్స్‌లను రూ.300 నుంచి రూ.400కు పెంచాలని కోరారు. సిక్ లీవ్‌లకు సంబంధించి జీతాలు చెల్లించాలన్నారు. పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ఉద్యోగులపై వేధింపులు ఆపాలన్నారు. డిమాండ్ల సాధనకు నిరంతర పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం కడప జోనల్ అధ్యక్షుడిగా వినోద్‌బాబు, జోనల్ కార్యదర్శిగా చెన్నారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీకర్ రెడ్డి, కార్యదర్శులు చెంచులయ్య, ఇస్మాయిల్, ఎర్రిస్వామి, నాగరాజు, భద్రావతి, సీసీఎంసీ మెంబర్లు వినోద్, గోపాలప్ప, 52 డిపోల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి

- ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న దామోదరరావు

ధర్మవరం అర్బన్: ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు, ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య డిమాండ్ చేశారు. స్థానిక ఎన్జీఓ హోంలో జిల్లా ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈయూ జిల్లా అధ్యక్షుడు కె.బి.నాగార్జునరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో దామోదరరావు మాట్లాడుతూ... గత 12 ఏళ్లుగా ఆర్టీసీలో కారుణ్య నియామకాలు తప్ప ప్రభుత్వం ద్వారా ఇచ్చిన నోటిఫికేషన్‌తో ఒక్క ఉద్యోగం కూడా భర్తీ చేయలేదన్నారు. ప్రస్తుతం ఆర్టీసీలో వివిధ కేటగిరిలలో దాదాపు 11వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటిని భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసి, బడుగు, బలహీన వర్గాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సిన పీఆర్సీ, డీఏ బకాయిలతో పాటు నూతన పీఆర్సీని ఏర్పాటు చేయాలని కోరారు. ఈహెచ్ఎస్ ద్వారా కనీస వైద్య సౌకర్యాలు కూడా అందడం లేదని మండిపడ్డారు. ఫలితంగా దాదాపు 350 మంది మృత్యువాత పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. రెఫరల్ ఆస్పత్రుల ద్వారా ఆర్టీసీ ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించాలన్నారు. సమావేశంలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నబీరసూల్, కడప జోన్ అధ్యక్షుడు కేకే కుమార్, జోనల్ కార్యదర్శి రాజశేఖర్, జిల్లా కార్యదర్శి వైపీ రావు, జోనల్ నాయకులు ఎన్సీ శేఖర్, అరుణమ్మ, జిల్లా నాయకులు నారాయణస్వామి, ఆర్ఎస్ రెడ్డి, ఏవీవీ ప్రసాద్, రమణప్ప, వాసులు, నరసింహులు, సుమో శీనా, తదితరులు పాల్గొన్నారు.

చెడు తిరుగుళ్లు వద్దంటే ఇల్లు విడిచి వెళ్లాడు!

ధర్మవరం అర్బన్: చెడు తిరుగుళ్లు వద్దని తల్లి హితవు పలకడంతో ఓ యవకుడు అలిగి ఇల్లు విడిచి వెళ్లిపోయాడు. పోలీసులు తెలిపిన మేరకు.. ధర్మవరంలోని మారుతీనగర్‌కు చెందిన బత్త శోభ కుమారుడు కిశోర్‌కుమార్ చెడు సావాసాలతో జులాయిగా మారి తిరిగేవాడు. తల్లి పలుమార్లు హెచ్చరించినా మార్పు రాలేదు. దీంతో ఈ నెల 24న కుమారుడిని ఆమె తీవ్ర స్థాయిలో మందలించింది. బుద్ధిగా ఏదైనా పని చేసుకోవాలని హితవు పలికింది. ఇది నచ్చని కిశోర్‌కుమార్ అదే రోజు ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఏ అఘాయిత్యం చేసుకున్నాడోనని ఆందోళనకు గురైన తల్లి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు.

'ఎలాంటి బ్లాక్‌మెయిల్ చేయలేదు'


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జయలక్ష్మి, వెంకటేష్

హిందూపురం టౌన్: బాలిక నగ్న వీడియోలతో తాము ఎలాంటి బ్లాక్ మెయిల్ చేయలేదని హిందూపురంలోని మేళాపురానికి చెందిన జయలక్ష్మి, వెంకటేష్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తాము వీడియోలు తీసుకుని బ్లాక్ మెయిల్ చేస్తున్నామనడం పూర్తిగా అవాస్తవమన్నారు. తమపై కావాలనే అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. పట్టణానికి చెందిన సువర్ణ తనకు స్నేహితురాలని, తమ మధ్య ఉన్న బంధంతో సువర్ణకు దాదాపు రూ.2కోట్లకు పైగా నగదును విడివిడిగా ఇచ్చామన్నారు. ఆమె రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడి పెట్టి, తన డబ్బును తిరిగి ఇస్తానని చెబితే, చెక్కులను, ప్రాంసరీ నోట్‌లను తీసుకుని ఇచ్చినట్లు వివరించారు. అయితే డబ్బు తీసుకుని చాలా కాలమైనా తిరిగి ఇవ్వకపోవడంతో ఇటీవల వెళ్లి అడిగామన్నారు. దీంతో తమపై అసత్య ఆరోపణలు చేస్తూ అందరినీ పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తోందన్నారు. దీనిపై పోలీసులు సైతం విచారణ చేపట్టారని గుర్తు చేశారు. తమకు ఇవ్వాల్సిన డబ్బు ఇవ్వమంటే ఇలా బురద చల్లడం సబబు కాదని అన్నారు.

9 మందికి ఎంపీడీఓలుగా పదోన్నతి

అనంతపురం సిటీ: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పని చేసే పరిపాలనాధికారులు (ఏఓలు), ఈఓఆర్డీలు (మారిన కొత్త హోదా) డిప్యూటీ ఎంపీడీఓలు పలువురికి ఎంపీడీఓలుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఆ శాఖ రాష్ట్ర కమిషనర్ వీఆర్ కృష్ణతేజ మైలవరపు శుక్రవారం రాత్రి ఉత్తర్వులు విడుదల చేశారు. రాష్ట్రస్థాయిలో జరిగిన పదోన్నతుల ప్రక్రియలో ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి ఇద్దరు ఏఓలు, మరో ఏడుగురు డిప్యూటీ ఎంపీడీఓలకు ఎంపీడీఓలుగా పదోన్నతి లభించినట్లు జెడ్పీ వర్గాలు తెలిపాయి. అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏఓగా పని చేస్తున్న వి.ధనుంజయనాథ్, తనకల్లులో ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పని చేస్తున్న రెడ్డెప్పకు రెగ్యులర్ ఎంపీడీఓ పోస్టులు దక్కాయి. ఇక డిప్యూటీ ఎంపీడీఓలుగా పని చేస్తున్న టీజీ నాగరాజు – హిందూపురం, నసీమ – అమరాపురం, టీ.జిలాన్ బాషా – పుట్లూరు, జి.శివాజీరెడ్డి – గుత్తి, నాగేశ్వరశాస్త్రి – బెళుగుప్ప, మమత –ధర్మవరం, వెంకటలక్ష్మమ్మ– శింగనమలకు డిప్యూటీ ఎంపీడీఓలకూ రెగ్యులర్ ఎంపీడీఓలుగా పదోన్నతి లభించింది.

ప్రపంచానికే న్యాయాన్ని పంచిన అంబేడ్కర్

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ


మాట్లాడుతున్న మాధవ

పెనుకొండ రూరల్: పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని ధారపోసిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ అన్నారు. అంబేడ్కర్ జయంతి ముగింపు వేడుకలను పెనుకొండలోని మార్కెట్ యార్డ్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. అనంతరం మాధవ మాట్లాడారు. న్యాయ శాఖ కోవిదుడుగా ప్రపంచానికే న్యాయాన్ని పంచిన మహనీయుడిగా అంబేడ్కర్ ఖ్యాతిగాంచారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, జోనల్ ఇన్‌చార్జ్ సందిరెడ్డి శ్రీనివాసులు, జిల్లా కో కన్వీనర్ గోపీనాథ్, రమేష్‌రెడ్డి, తలుపుల గంగాధర్, భాస్కర్ నాయక్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

5న జాతీయ లోక్ అదాలత్

అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి మే 5న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ.భీమారావు, జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి ఈ. శివప్రసాద్ యాదవ్ తెలిపారు. అలాగే అనంతపురం జిల్లా కోర్టు పరిధిలోని కేసుల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రోడ్డు ప్రమాదం కేసులు, సివిల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, కుటుంబ తగాదాల (విడాకుల కేసులు కాకుండా) , పారిశ్రామిక వివాదాలు, రాజీ చేయదగ్గ క్రిమినల్ కేసులు, వినియోగదారుల ఫోరం కేసులు, ప్రిలిటిగేషన్ తదితర కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేస్తామన్నారు. కక్షిదారులందరూ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చెవిలో కమ్మలు లాక్కొని ఉడాయింపు


బాధితురాలు జయమ్మ

సోమందేపల్లి: మండలంలోని చాకర్లపల్లి రైల్వే గేటు వద్ద జామ పండ్లు విక్రయిస్తున్న ఓ వృద్ధురాలి చెవిలోని బంగారు కమ్మలను లాక్కొని దుండగులు పరారయ్యారు. ఈ ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్నేహలత నగర్‌కు చెందిన జయమ్మ పండ్లు విక్రయిస్తుండగా హిందూపురం వైపు నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు ఆమె వద్ద ఆపి, చెవిలోని కమ్మలను బలవంతంగా లాక్కొని ఉడాయించారు. ఘటనతో ఆమె చెవి తమ్మలు తెగిపోయి తీవ్ర రక్త స్రావమైంది. స్థానికులు ఆమెను హిందుపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తులం బరువున్న బంగారు కమ్మలను అపహరించుకెళ్లినట్లు పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

జాతీయ స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీకి ఎంపిక



రొళ్ల: జాతీయ స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీలో ప్రాతినిధ్యం వహించే ఏపీ జట్టులో రొళ్ల మండలం దొమ్మరహట్టి వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు టి.నవదీప్, టి.వరుణ్‌సందేష్, ఎన్.హర్షవర్ధన్, ఎం.దినేష్ చోటు దక్కించుకున్నారు. మే 3, 4వ తేదీల్లో నెల్లూరు వేదికగా జాతీయ స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీ జరగనుంది. ప్రతిభ చాటిన విద్యార్థులను ఆ పాఠశాల ప్రిన్సిపాల్ మైలారప్ప, వైస్ ప్రిన్సిపాల్ రమేష్ పీఈటీలు వెంకటనారాయణ, చంద్రశేఖర్, అనంతపురం జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు శుక్రవారం అభినందించారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగంలో పలువురికి చోటు


నరేంద్రరెడ్డి


రాజేంద్ర ప్రసాద్

పుట్టపర్తి టౌన్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన పలువురికి ఆ పార్టీ రాష్ట్ర విద్యార్థి విభాగంలో చోటు కల్పిస్తూ.. పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడిగా నరేంద్ర రెడ్డి, జనరల్ సెక్రటరీగా రాజేంద్రప్రసాద్ నియమితులయ్యారు.

బాలికల భద్రతకు పటిష్ట చర్యలు

అనంతపురం సెంట్రల్: యుక్త వయస్సు బాలికల భద్రతకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోందని ఐసీడీఎస్ పీడీ నాగమణి తెలిపారు. నగరంలోని ఓ ప్రైవేటు సెమినార్ హాల్‌లో ఉమ్మడి జిల్లాలోని ఐసీడీఎస్ నోడల్ ఆఫీసర్లు, యూనిసెఫ్ ప్రతినిధులతో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు అధికారులు మాట్లాడారు. యుక్త వయస్సు బాలికల సాధికారిత కోసం ప్రత్యేక క్యాలెండర్‌ను విడుదల చేస్తూ ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. క్యాలెండర్ ప్రకారం ప్రతి నెలా చేపడుతున్న అంశాలను వివరించారు. బాల్య వివాహాలు నివారించడానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్దామని పిలుపునిచ్చారు. జెడ్పీ సీఈఓ భాస్కర్ రెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు, శ్రీసత్యసాయి జిల్లా ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీఆర్డీఏ పీడీ ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

మడకశిరకు సోలార్ పవర్ ప్రాజెక్ట్

మడకశిర: మడకశిర మండలానికి సోలార్ పవర్ ప్రాజెక్ట్ మంజూరు చేస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసింది. మండలంలోని కల్లుమర్రి, మణూరు, ఉప్పార్లపల్లి, వైబీ హళ్లి, బుళ్లసముద్రం గ్రామాల పరిధిలో ఈ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం దాదాపు 2,500 ఎకరాల భూమిని సేకరించనున్నట్లు సమాచారం. ప్రాజెక్ట్ ఏర్పాటుకు భూములిచ్చే రైతులకు ఎకరాకు ఏడాదికి రూ.31వేల చొప్పున ప్రతి రెండేళ్లకోసారి 5 శాతం పెంపుతో పరిహారం చెల్లించనున్నట్లు జీఓలో ప్రభుత్వం పేర్కొంది.

వివాహిత ఆత్మహత్య

కనగానపల్లి: కుటుంబ సమస్యలతో విసుగు చెందిన ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు... కనగానపల్లి గ్రామానికి చెందిన బోయ నాగభూషణ, అంజనమ్మ (32) దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇటీవల కుటుంబంలో సమస్యలు తీవ్రం కావడంతో మనోవేదనకు లోనైన ఆమె గురువారం రాత్రి ఇంట్లోను పురుగుల మందు సేవించింది. విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన కుటుంబసభ్యులు ఆమెను వెంటనే అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమిస్తుండడంతో బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆమె మృతి చెందింది.